క్లుప్తంగా

ఘనంగా ఉరుసు ఉత్సవం



దర్గా వద్ద ప్రత్యేక ఫాతేహాలు నిర్వహిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : పలగాడి వీధిలోని రఫాయి అల్లా ఉర్సు ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ షా అహ్మద్ సిరాజుద్దీన్ ఖాద్రీ ఆధ్వర్యంలో ఉత్సవాలను కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బహిరంగ వేలం 18కి వాయిదా

కమలాపురం : నగర పంచాయతీలో 2025–26 సంవత్సరానికి దినసరి మార్కెట్టు, బస్టాండు, జంతు వధశాల, మార్కెట్ రూములు(7), గుత్త హక్కులు చెల్లించుటకు ఏర్పాటు చేసిన బహిరంగ వేలం ఈనెల 18కి వాయిదా వేశామని నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పైన పేర్కొన్న వాటికి వేలం పాట నిర్వహించారు. అయితే వేలంపాటకు హాజరైన పాటదారులు ఎవ్వరూ కూడా పాల్గొనకపోవడంతో ఈ వేలం పాట 18వ తేదీకి వాయిదా వేశామన్నారు.

సచివాలయాల తనిఖీ



వెలిదండ్ల సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

లింగాల : మండలంలోని పార్నపల్లె, వెలిదండ్ల గ్రామ సచివాలయాలను బుధవారం జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.30 గంటలకు ఆమె పార్నపల్లె సచివాలయానికి వెళ్లగా అక్కడ సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు పంపించాలని ఎంపీడీఓకు సూచించారు. అదేవిధంగా వెలిదండ్ల సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పీ4 సర్వే, వర్క్ ఫ్రం హోం తదితర సర్వేలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వెలిదండ్ల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ

లింగాల : స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బుధవారం 1997–98వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు వాటర్ కూలర్‌ను పాఠశాల హెడ్మాస్టర్ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

పాఠశాలను తరలించవద్దు

చింతకొమ్మదిన్నె : విద్యాశాఖ అధికారులు కొప్పర్తి శివాజీనగర్‌లోని 3, 4, 5 తరగతి విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలోని ఎర్రమాసుపల్లెకు తరలించాలని అనుకున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు ఆగ్రహంతో బుధవారం శివాజీనగర్ మండల పరిషత్ స్కూల్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. పాఠశాలలో దాదాపు 40 మంది పిల్లలు ఉన్నారని ఆడపిల్లలకు భద్రత ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తూ తరలించే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొత్తపు శ్రీనివాసరెడ్డి, శివాజీనగర్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న అధికారిణి మీనాక్షి

ఎర్రగుంట్ల : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారిణి మీనాక్షి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శివప్రసాద్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి వితరణ



హెచ్ఎంకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2002–2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.50 వేలు నగదును పాఠశాల ప్రహరీ నిర్మాణానికి బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డికి అందజేశారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు(వల్లూరు) : చెన్నూరు మండలం శివాల్‌పల్లె గ్రామపంచాయతీ పరిధిలోని గోపవరం పరిసర ప్రాంతాల్లో రెండు స్టాక్ పాయింట్లలో బుధవారం సుమారు 270 అక్రమ రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు చెన్నూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంరాజు తెలిపారు. చెన్నూరుకు చెందిన బ్రహ్మయ్య అనే వ్యక్తికి చెందినవిగా గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



పులివెందులలో జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



చింతకొమ్మదిన్నెలో కేక్ కట్ చేస్తున్న నరేన్ రామాంజులరెడ్డి



ఎర్రగుంట్లలో జెండా ఎగురు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం 15వ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు పాల్గొని మొదటగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు కేక్ కట్ చేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల జీవితాలలో వెలుగులు నింపేందుకు ప్రజాక్షేత్రంలో పురుడు పోసుకున్న పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా మాజీ సీఎం వైఎస్ జగన్ పాలన సాగించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దాదాపు 99 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీకి కష్టాల్లో తోడుగా ఉన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అధికార కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, వేముల జెడ్పీటీసీ బయపురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, లింగాల సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, సర్వోత్తమరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, అంబకపల్లి నారాయణస్వామి, సోపాల వీరా, మరకా శివకృష్ణారెడ్డి, రమేష్, మల్లికార్జునరెడ్డి, రమేష్‌రెడ్డిలతోపాటు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల, టౌన్ కన్వీనర్లు ఉత్తమారెడ్డి, గంగాధర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అని నినదించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావమే ఒక చరిత్ర అన్నారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎన్ని కష్టాలు, ఒడిదడుకులు వచ్చినా మొక్కవోని ధైర్యంతో జగనన్న ముందుకు సాగారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, రామసుబ్బారెడ్డి, భాస్కర్, దేవదానం, జనార్ధన్‌రెడ్డి, జిలానీబాషా, మోనార్క్, శ్రీనివాసులరెడ్డి, నామాలశేఖర్, మర్రి సుబ్బన్న, జెట్టి నగేష్, మైసూరారెడ్డి, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు ఘనంగా వేడుకలను నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెడబల్లి గణేష్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్ యాదవ్, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, గుమ్మల్ల సాయిరెడ్డి, వారిష్, నిత్య పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ కల్లూరు రఘునాథ్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి మూడు రోడ్ల కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. వీరపునాయునిపల్లె ఎంపీటీసీ రాఘవయాదవ్, పాలగిరి, గంగిరెడ్డిపల్లె మాజీ ఎంపీటీసీలు చెండ్రాయుడు, రవి, కమలాపురం మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : ఉటుకూరు వైఎస్సార్ సర్కిల్ వద్ద పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ సీపీ పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుత్తిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు జి.వి.సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ గుడా ప్రభాకరరెడ్డి, కార్పొరేటర్లు చంద్రహాసరెడ్డి, ప్రసాదరెడ్డి, యువజన నాయకుడు ఈశ్వరరెడ్డి, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సోదరుడు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వరరెడ్డి, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, కొమెర్ల మోహన్‌రెడ్డి, హృషికేశవరెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాసరెడ్డి, నర్సాజి కొట్టాల సుబ్రమణ్యం, దళితనాయకులు సింగరయ్య, మార్బల్ శ్రీను, కిరన్, కో ఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, ఎంపలాకు లక్షుమయ్య యాదవ్, వేణు తదితులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం ముందు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, తిరుమలరెడ్డి, సిద్ధు, రవికుమార్, రఘురామిరెడ్డి, సతీష్‌కుమార్, కాశీ, మల్లేశ్వరరెడ్డి, రమేష్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఎగుర వేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. అందుకే యువత పోరుకు ఎర్రగుంట్ల నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కడపకు వెళ్లాయన్నారు. కార్యక్రమంలో నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మూలె సుధీర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా నిడుజివ్విలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మండల పార్టీ అధ్యక్షులు తమ్మిశెట్టి బాలయ్య, పట్టణాధ్యక్షులు జయరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమలాపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చెన్నూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు



వీరపునాయునిపల్లెలో జెండాను ఎగురవేస్తున్న మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి



జమ్మలమడుగులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి



ముద్దనూరులో జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

యువత పోరుకు తరలి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తలపెట్టిన యువత పోరుకు పులివెందుల మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, నూర్‌బాషా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రసూల్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి. గౌడ సంఘం అధ్యక్షుడు శేషయ్యగౌడ్, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు తరలి వెళ్లారు.

వేముల : మండలం నుంచి మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

లింగాల : మండలం నుంచి మండల అధ్యక్షుడు బాబురెడ్డి, తాలుకా వ్యవసాయ రైతు సంఘ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు కిశోర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి,. వెలుగోటి చంద్రశేఖర్‌రెడ్డి, పవన్ చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ రాజబాబు, రావులకొలను సర్పంచ్ కంభం మహేశ్వరరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సోమేశ్వరరెడ్డి, రిషికేశవరెడ్డి, నీలవర్థన్‌రెడ్డి, నారాయణరెడ్డి, ద్వారకనాథరెడ్డి, అశ్వర్థరెడ్డి, సోమల చెన్నకేశవరెడ్డి, తదితరులు తరలి వెళ్లారు.

వేంపల్లె : వేంపల్లె నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మునీర్‌బాషా, రవిశంకర్‌గౌడ్‌ల పిలుపు మేరకు బయలుదేరి వెళ్లారు.

వల్లూరు (చెన్నూరు) : కమలాపురం నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షుడు గుమ్మల్ల సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులంతా తరలి వెళ్లారు.

తొండూరు : మండలం నుంచి మండల అధ్యక్షుడు భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్లు సురేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రజినికాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు రామసుబ్బారెడ్డి, గంగయ్య గురుమోహన్‌రెడ్డి, దస్తగిరి, ఎంపీటీసీ విజయ్ శంకర్, కో ఆప్షన్ మెంబర్ ప్రకాష్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, బాలగంగిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, లక్ష్మిరెడ్డి, రమేష్, మునెయ్య, గురుమోహన్‌రెడ్డి, రమణారెడ్డి, మధు, తదితరులు తరలివెళ్లారు.

పెండ్లిమర్రి : యువత పోరు ర్యాలీకి జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డిల ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు.

యువత పోరు విజయవంతం



జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డి

వల్లూరు : విద్యార్థులు, యువత పట్ల కూటమి ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య దోరణిని ప్రశ్నిస్తూ వై ఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువత పోరు' విజయవంతం అయ్యిందని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కడపలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులు ఈ ఆందోళనల్లో స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అండగా నిలిచిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పేదవారికి ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని, పేద, మధ్యతరగతి విద్యా ర్థులకు వైద్య విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించిన వైఎస్ జగన్ ఐదేళ్లలోనే 5 కాలేజీలను పూర్తి చేసి అడ్మిషన్లు కూడా ఇచ్చారన్నారు. మిగతా కాలేజీలు వివిధ దశల్లో నిర్మాణం జరుపుకుంటుండగా వాటిని పూర్తి చేయాల్సిన సీఎం చంద్రబాబు సేఫ్ క్లోజ్ పేరుతో పక్కన పెట్టి రాష్ట్ర విద్యార్థులకు తీవ్ర ద్రోహం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిగత విద్యా సామర్థ్యాలను పెంచుకోవాలి



మాట్లాడుతున్న వైవీయూ అసోసియేట్ ప్రొఫెసర్ కె.లలిత

వేంపల్లె : విద్యార్థులందరూ తమ వ్యక్తిగత విద్యా సామర్థ్యాలను పెంచుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత తెలిపారు. బుధవారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సైకలాజికల్ కౌన్సిలింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి ఒక సంఘజీవి ప్రతి విద్యార్థి విద్యార్థి దశలో తాత్కాలికంగా ఆలోచించి ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి వారి, వారి శక్తి సామర్థ్యాలను, బలహీనతలను అంచనా వేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని పెట్టుకున్ని దాన్ని సాధించడానికి కృషి చేయాలన్నారు. తమ లక్ష్యాన్ని సాధించే దశలో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. దీనికి బలవర్థకమైన ఆహారం తీసుకోవడమే కాకుండా యోగా చేయాలన్నారు. ముఖ్యంగా స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఏవీఎస్ కుమార్‌స్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జి.వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3, 4 తరగతుల విలీనాన్ని ఆపాలి

వల్లూరు (చెన్నూరు) : 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర నాయకులు లక్ష్మీరాజ మాట్లాడుతూ అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రైమరీ స్కూల్లో విలీనం చేస్తే ఉద్యమాలు చేపట్టవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వండి



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : తడి, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రాముడు ప్రజలకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఇస్లాంపురలో ఆయన పర్యటించి నీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధిలో అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమికి మరింత శక్తి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

జమ్మలమడుగు : ప్రకృతి వ్యవసాయంతో భూమికి మరింత శక్తి వస్తుందని వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం దేవగుడి గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల తక్కువ ఖర్చుతో పాటు పంట దిగుబడి ఎక్కువ వస్తుందన్నారు. ఎండకు వానకు భూమిని కప్పి ఉంచడం వలన భూమిలో సూక్ష్మ జీవులను కాపాడటం జరుగుతుందన్నారు. పీఎండీఎస్ వేయడం వలన భూమి లోపల సూక్ష్మ జీవుల వైవిధ్య అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు రాణి, వినోదు, పీసీఆర్‌పీ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో కార్మికులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ ఎస్ఐ

కమలాపురం : ఆటో డ్రైవర్లు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల పట్ల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటో డ్రైవర్లందరూ తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ ఆటోలు ఆపి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. మీకు కేటాయించిన ప్రాంతాల్లోనే ఆటోలను నిలుపుకోవాలని, ప్రయాణీకులు అక్కడికే వచ్చి ఆటోలు ఎక్కుతారని సూచించారు. క్రాస్ రోడ్డులో బస్సుల చుట్టూ ఆటోలు అడ్డం పెడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇలా మరో సారి జరిగితే అలాంటి వారిపై చర్యలు తప్పవని, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఆటోకు పోలీస్ నెంబర్ తప్పని సరి అన్నారు. పోలీస్ నెంబర్ లేని వారు సాయంత్రం వచ్చి అన్ని పత్రాలు ఇచ్చి నెంబర్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

పులివెందుల టౌన్ : పట్టణంలోని సెయింటాన్స్ పాఠశాలలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాస్టిక్ వాడకంవల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు కూడా తమ ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో కాకుండా స్టీల్ బాక్సులలో తెచ్చుకోవాలన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చింతలమడుగుపల్లెలో ఉన్న రేషన్ షాపును ఆయన తనిఖీ చేసి స్టాక్ వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుండి 17తేదీ వరకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. బియ్యం స్టాక్ పెట్టుకుని కూడా బియ్యం పంపిణీ చేయకపోతే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బియ్యం కోసం అనేక మంది ఫిర్యాదులు చేస్తున్నారని, అలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత డీలర్లదే అన్నారు. స్టాక్ పూర్తిగా అయిపోయేంత వరకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోండి

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణకు బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు, బలిజ కులాల మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన తెలుపుతూ మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తైన తర్వాత కుట్టు మిషన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు 18 ఏళ్ల నుండి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. ఈనెల 8వ తేదీ నుండి ఈనెల 22వ తేదీవరకు సంబంధిత సచివాలయ, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏర్పాటు



కార్యవర్గ సంఘ వివరాలను ఎంపీడీఓకు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పంచాయతీ కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడప జిల్లా పంచాయతీ కార్యవర్గ ఎంపిక కోసం ముందుగా మండల పంచాయతీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కోమన్నూతల పంచాయతీ కార్యదర్శి హరికిశోర్ మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా, కామసముద్రం పంచాయతీ కార్యదర్శి పృథ్వీ నటరాజ్ ఉపాధ్యక్షుడిగా, చిన్నకుడాల పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మీదేవి కార్యదర్శిగా, రామన్నూతనపల్లె పంచాయతీ కార్యదర్శి సల్మాను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆ సంఘ అధ్యక్షుడు హరికిశోర్ తెలిపారు. పంచాయతీ కార్యవర్గ సంఘ సభ్యుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



మాట్లాడుతున్న డీసీ సుజాత

వల్లూరు : ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని పంచాయతీల జిల్లా కో ఆర్డినేటర్ సుజాత తెలిపారు. బుధవారం వల్లూరులోని ఎస్‌డబ్ల్యూపీసీలో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర, క్లాప్ షెడ్ వారికి ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌పీలు రాఘవరెడ్డి, దేవేంద్రరెడ్డిలు గృహాల నుంచి చెత్త సేకరణ, పొడి రైతులతో పేడ ఒప్పందం, షెడ్‌కు తరలింపు, నాడెప్ ప్రిపరేషన్ వాటి పై ఆకు కూరలు పెంపకం, వర్మీ బెడ్ ప్రిపరేషన్, ప్రాసెసింగ్, ప్యాకింగ్ వరకు, పొడి చెత్త సెకండ్ లెవెల్ సెగ్రిగేషన్, షెడ్ రిజిష్టర్స్ నిర్వహణ, హరిత రాయబారులను నియమించడం తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను శుభ్రం చేయడం వలన గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించ వచ్చన్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికి పర్యటించి హరిత రాయబారులు తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలన్నారు. దానిని ఎస్‌డబ్ల్యూపీసీకు చేర్చి వేరు చేసి సంపద సృష్టించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఈ ఆదాయం ద్వారా పంచాయతీలు అభివృద్ధి బాట పడతాయన్నారు. కార్యక్రమంలో వల్లూరు, కమలాపురం, వీఎన్‌పల్లె, ఎర్రగుంట్ల మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు తదితర అనేక సమస్యలకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.